# వరకట్నం

యస్. యమ్. షరీఫ్

సరళకు పెళ్ళయింది. కాని, పెళ్ళయిందగ్గర్నించి బ్రతుకు నరకమయింది. కారణం, అనుకున్న వరకట్నం యాభైవేలు తన తల్లిదండ్రులు ఇవ్వలేకపోవటమే. ఇల్లు అమ్మి కట్నంగా ఇద్దామని ఎత్తిపెట్టిన యాభైవేలు పెళ్ళికి ముందు రోజే దొంగలపాలవటంతో, వున్నయిల్లూ పోయింది, డబ్బూపోయింది. పుట్టెడు దుఃఖంతో వాళ్ళు కుమిలి పోతూవున్నా, ఇస్తామన్న డబ్బు ఎలాగైనా ఇవ్వాలని తాపత్రయం పడుతూనే వున్నారు. కాని, కుదరటంలేదు. ఈ విషయంపై అత్తవారింట్లో అత్తపోరుతప్ప మిగతా సమస్యలు ఏవీలేవు.

సరళ మెట్టినింట్లో అడుగుపెట్టినప్పుడు అత్తతోబాటుఆడబిడ్డ కూడా వుండేది. ఆడబిడ్డకు కూడా పెళ్ళయింది. వచ్చిన మహానుభావుడు కట్నం లేకుండానే పెళ్ళి చేసుకొన్నాడు.

పక్కింట్లో సూర్యకాంతం అనే ఆవిడ చేరినప్పటి నుండి సరళకు అత్తపోరు ఇంకా ఎక్కువయింది.



అత్తలేనప్పుడు చూసి సూర్యకాంతం ఆ వస్తువు ఈ వస్తువు అడిగేందుకు వస్తోంది. లేదంటే ఆ కోపంతో అత్తతో లేనిపోనివి కల్పించి చెప్పి తిట్లు తినిపించాలని చూస్తుంది. ఇలా ఆలోచిస్తున్న సరళకు తలుపుతట్టిన శబ్దం వినిపించింది.

'అమ్మాయ్ సరళా!' సూర్యకాంతం తలుపు తట్టుతూ పిలుస్తోంది.

'వస్తున్నాను పిన్ని' అంటూ సరళ వెళ్ళి తలుపు తీసింది. సూర్యకాంతం అడక్కుండానే, గుమ్మంవద్దనే నిలబెట్టి "అత్తగారు ఇంట్లో లేరండీ" అంది.

"ఆహా అలాగా" అంది సూర్యకాంతం పెద్ద చెప్పొచ్చావ్‌లే అని తెలిసేకదా రావటం, అమాయకురాలివి నీకు ఏమీ తెలీదన్నట్లు చూస్తూ.

"అమ్మాయ్, చక్కెర అయిపోయింది, ఒక గ్లాసు చక్కెర ఈయమ్మా".

సరళ మనసులో "ఈవిడ ఇంతకు మునుపు కూడా చక్కెర తీసుకెళ్ళింది. మళ్ళీ చక్కెర కావాలంటూ వచ్చింది. ఏది తీసుకెళ్ళినా తిరిగిచ్చి చావదు. సిగ్గులేకుండా మళ్ళీ ఒకటి కావాలంటూ వస్తోంది. ఈరోజు చక్కెర లేదని చెప్పాలి. ఏమైనా చెప్పుకోనీ అత్తగారితో" అని నిర్ణయించుకొని

"చక్కెర లేదండి" అన్నది సరళ ముక్తసరిగా.

"అదేంటమ్మా! నిన్ననేగా మీ అత్తగారు చక్కెర తెచ్చారని చెప్పింది. అంతలోనే అయిపోయిందా" అంది సూర్యకాంతం నోరు అదోరకంగా పెట్టి.

సరళ ససేమిరా ఇవ్వకూడదనుకొంది.'లేదంటే లేదంది. మీరే తీసుకుపోయిన వస్తువు ఎప్పుడైనా ఇచ్చారు కనకనా మీకు మళ్ళీ ఇవ్వడానికి. మీకు నేనివ్వనండి. కావాలంటే, మా అత్తగారొచ్చింతర్వాత వచ్చి, ఆమెదగ్గరే తీసుకోండి' అని కుండబద్దలు కొట్టినట్లు చెప్పేసి తలుపులు మూసుకొంది.

సూర్యకాంతం కుతకుత ఉడికిపోయింది. "సరే చూస్తావుగా, నీకు సూర్యకాంతం అంటే ఏమిటో తెలీదు. నాతఢాకా చూపిస్తా" అనుకొంటూ వెళ్ళింది.

సరళకు గుబులుగానే వుంది. ఈ ముండ అత్తగారితో ఏమేమి చెప్తుందోనని.

సరళ అత్త, ఛాయాదేవి గుడినుండి వస్తూ వుంటే దారిలోనే ఆపింది సూర్యకాంతం.

"ఏమిటే, పూజ అదీ అయిపోయిందా".

పూజలైతే చేస్తున్నాముగాని నాకు మనమల్ని ఎత్తుకొనే అదృష్టం కలగలేదు ఇంకా అంది ఛాయాదేవి.

సరళమీద కసి తీర్చుకోవడానికి కొకపాయింటు దొరికింది. ఇదే మంచి అవకాశం అనుకొని పుండు మీద కారం చల్లినట్లు ఛాయాదేవి మీద ఘాటైన మాటల అస్త్రాలు ఉపయోగించటం మొదలుపెట్టింది.

"చూడు ఛాయా, సరళకు పెళ్ళయి మూడు సంవత్సరాలయింది. ఇంకా పిల్లలు కలగలేదంటే ఇంక కలగరు. నీవు మీ అబ్బాయికి వేరే పెళ్ళి చేసేయ్. నేను ఇలా అంటున్నానుకదా అని ఏమనుకోవద్దు. ఏదో, నీ మంచి కోరినదాన్ని కాబట్టి అంటున్నాను" అంది.

ఛాయాదేవి ముఖం సీరియస్ అయింది. "ఏం చేస్తాం అంతా మాఖర్మ అంది.

సూర్యకాంతం ఇదే సమయంలో ఛాయాదేవి గాయాన్ని ఇంకొంచెం కెలకాలనుకొంది. చూడు ఛాయా, నీ కొడుక్కి ఫ్యాక్టరీ మేనేజ్ మెంట్ ద్వారా ఇల్లు అలాట్ అయిందికదా! దానికిముందు యాభైవేలు కట్టాలికదా! అబ్బాయిపెళ్ళి చేశావనుకో కనీసం ఆ యాభైవేలు కట్నం క్రింద వస్తాయి. నీకు ఇల్లూ, మనవడూ దొరికినట్టవుతుంది. నువ్వు వూ అన్నావను కో డెబ్బైవేలు కట్నం ఇచ్చే సంబంధం రెడీగా వుంది" అని సూర్యకాంతం, ఛాయాదేవిని మాట్లాడనివ్వకుండా అనేసింది.

ఛాయాదేవికి కోడలిమీద కోపం నసాళానికెక్కింది. కోడలి వల్లనే తమకిన్ని కష్టాలు అనిపించింది సూర్యకాంతం మాటలు విన్న తర్వాత. కొడుక్కి మళ్ళీ పెళ్ళి చేసే సలహా బాగున్నట్లనిపించింది.

ఇంటికి ధుమధుమ లాడుతూ వచ్చింది ఛాయా

## బూతుబొమ్మ

"ఆ జోగారావు నాస్తికుడు కదరా! మరలా దేవాలయాల చుట్టూ తిరుగుతాడేం?"

"బూతుబొమ్మలు చూడ్డానికేలే" అసలుసంగతి చెప్పాడు.

దుర్గాగోపి, తగరపువలస.

దేవి. అత్తగారి కోపానికి కారణం తెలీదు సరళకి.

వస్తూనే ఛాయాదేవి "కాఫీపట్రా" అంది సరళని చూస్తూ. సరళ కాసేపటి వరకు ఏమీ మాట్లాడలేదు. "ఏంటలా గుడ్లగూబలా చూస్తూ నిల్చున్నావు. ఫో! పట్టుకురా" అని గట్టిగా అంది.

"పాలు, పిల్లి తాగేసింది" అంది సరళ మెల్లగా తప్పు జరిగిపోయిందన్నట్లు బాధపడుతూ.

"ఏంటే నీ పొగరు. పిల్లిపాలే తాగిపోతే నువ్వుండేదెం దుకే? నీ బాబు సొమ్మనుకున్నావా? ఇలా నష్టాలు చేస్తూపోతే మేమెట్లా భరించేదే ముదనష్టపుదానా. కట్నం తేకపోతివి. పోనీ, మనవల్ని ఎత్తుకుంటూ గదా అని ఆశపడితే నువ్వు గొడ్రాలివి. ఇంక నువ్వుండి లాభం లేదు. వెళ్ళు ఇంట్లో ఒక్క క్షణం వుండొద్దు" అని ఒక్కతోపు తోసింది.

అలా నెట్టడంతో సరళ తల గోడకు తగిలి బొప్పికట్టింది. సరళ ఏడ్వటం మొదలు పెట్టింది. "ఈదొంగ ఏడుపులు మాని సామాను సర్దు. ఈ ఇంట్లో ఇంకొక క్షణం వుండేదానికి వీలులేదు. మావాడికి వేరే పెళ్ళి చేస్తాపో" అంది.

"అత్తయ్యా, వారొచ్చేవరకు వుంటా"నని ప్రాధేయ పడింది.

వాడు డ్రైవింగ్ పూర్తి చేసుకొని వచ్చేసరికి ఒకనెల పడ్తుంది. అంతవరకు కూర్చుని తీరగా మెక్కుదా మనా?

'ఫో' అంటూ జుట్టు పట్టుకొని గేటువరకు తోసుకొచ్చి బయటకు తోసేసింది. లోపలికి సరళపెట్టె పట్టుకొచ్చి రోడ్డుమీదికి విసిరేసింది.

సూర్యకాంతం దూరం నుంచి చూస్తూ... "అయింది తాను అనుకొన్నదంతా అయింది" అనుకొని సంతోషిస్తూ వుంది.

పెట్టె పట్టుకొని బస్ స్టాండ్ వైపు నడిచింది సరళ. అప్పుడే బసు దిగివస్తున్న ఆడబిడ్డ లలిత, ఆమె భర్త చంద్రశేఖరం కనిపించారు.

'ఎక్కడికి వెళ్తున్నావు వొదినా'? అంది లలిత.

'సరళ భోరున ఏడుస్తూ జరిగిందంతా చెప్పింది.

"వదినా నువ్వేం భయపడకు నేనున్నాగా అంతా సర్దుతాను. నువ్వు ధైర్యంగా వుండు. నీకు పది రోజుల్లోగా పరిస్థితి అంతా చక్కబడని ఉత్తరం రాస్తాను వచ్చేయ్" అన్నది లలిత.

ఆడబిడ్డ ఇచ్చిన భరోసాతో పుట్టింటికి బస్సెక్కింది సరళ.

లలిత తన భర్తతో ఆటోలో ఇల్లు చేరుకొన్నారు. దారిలో వాళ్ళొక పథకం వేసుకొన్నారు.

పథకం ప్రకారం లలిత వచ్చిరావడంతో తల్లిదగ్గరకే ఏడుస్తూ వెళ్ళింది.

'ఏంటే ఎందుకేడుస్తున్నావు' అంది ఛాయాదేవి.

"ఆయనేదో కొత్త వ్యాపారం చేస్తారట, యాభైవేలు కావాలంటున్నారు. ఇవ్వకపోతే నాదిలేసేట్టు వున్నారు. వారు నన్ను ప్రేమించి పెళ్ళి చేసుకొన్నారు గదా! అని నువ్వేమీ కట్నం ఇవ్వలేదు. ఇప్పుడు కావాలంటున్నారు" అని భోరున ఏడ్వడం మొదలుపెట్టింది.

"నువ్వుండవే నేనల్లుడిగారితో మాట్లాడుతాను" అని ఛాయాదేవి అల్లుడున్న గదిలోకొచ్చింది.

"అల్లుడుగారూ, మీరు ముందు కట్నం అడగలేదు. ఇప్పుడు తెమ్మంటే ఎలాగండి. మా పరిస్థితి గమనించండి మేమిచ్చేస్థితిలో లేము ఆయన పోయిన తర్వాత. నేనిన్నిటికి అబ్బాయిమీదనే ఆధారపడి వుంటున్నాను. ఎక్కడ్నించి తెచ్చి ఇవ్వమంటారండి అంటూ ప్రాధేయపడ్డం" మొదలు పెట్టింది ఛాయాదేవి.

అల్లుడుగారేమో కొంచెం కూడా కరగలేదు. పైగా "పదిరోజులే టైమిస్తున్నాను. మీరు ఎలాగైనా తెచ్చి యివ్వాలంతే, లేదంటే మీ అమ్మాయిని మీ ఇంట్లోనే పెట్టుకోండి" అని ఆర్డరు పడేశాడు.

ఇంతలో లలిత సరళకు ఉత్తరం వ్రాసింది. ఆమె తండ్రి చెక్కు పుస్తకంలో ఒక చెక్కుమీద యాభైవేలు వ్రాయించి, తండ్రి సంతకం తీసుకొని వెంటనే బయలుదేరిరమ్మంది. బ్యాంకులో అంత డబ్బు లేకపోయినా ఫరవాలేదని, తాము ఆడబోతున్న నాటకం యావత్తు రాసింది. సరళ వహించవలసిన పాత్ర కూడా వుత్తరంలో వ్రాసింది.

ఉత్తరం చేరిన మరుసటినాడే సరళ వచ్చింది. వస్తూనే యాభైవేలు చెక్కు అత్తగారికి చేతిలోపెట్టి కాళ్ళకు నమస్కరించింది. ఛాయాదేవి సంతోషంతో ఉక్కిరిబిక్కిరయింది.

"చూశావా, మీనాన్న ఎంత మంచివాడో మాటంటే మాటే, కరెక్టుగా ఇచ్చేశాడు.

ఆ చెక్కు తీసుకొని గబగబా వెళ్ళి అల్లుడి గదిలో దూరింది. "అల్లుడుగారూ ఇదిగో మీరడిగిన యాభై వేలు తీసుకోండి" అన్నది.

'చాలా సంతోషమండి' అత్తగారూ అన్నాడు అల్లుడు.

"అంతా, భగవంతుని దయ నాయనా ఇప్పుడే పోయి దేవుడికి కొబ్బరికాయ కొడతా" అంటూ ఛాయాదేవి గుడికెళ్ళింది.

ఛాయాదేవి ఇంటిగేటు దాటుతూనే, 'వదినా, ఇదిగో నీవిచ్చిన చెక్కు. చింపేస్తున్నాను' అంటూ ఆ చెక్కును చింపేసింది లలిత.

సరళ కళ్ళు ఆనందభాష్పాలతో నిండిపోయాయి.

'అమ్మాయ్ లతా, ఆడబిడ్డలంటే అత్తగారితో చేరి పోరుపెడ్తారని విన్నానేగాని, నీలాంటి ఆడబిడ్డలు కూడా వుంటారని ఇప్పుడే అర్థమయింది. నువ్వు నా సంసారాన్ని నిలబెట్టావమ్మా. నీవు చిన్నదానివైనా నాపాలిట దేవతవైనావు. మీ దంపతులిద్దరికి జీవితాంతం నేను కృతజ్ఞురాలిగా వుంటానమ్మా" అంది సరళ. ఆమెకు తెలీకుండానే చెక్కిళ్ళమీద నుండి ఆనంద భాష్పాలు ధారాప్రవాహంగా కారిపోతున్నాయి.

'పూరుకో వదినా', నేనేం చేశానని ఇంత పొగుడుతున్నావు అంది లలిత.

-000-